# Signing of the India-Japan Memorandum of Cooperation on Specified Skilled Workers

January 18, 2021

## నిర్దిష్ట నైపుణ్య కార్మికులకు సంబంధించి సహకార ఒప్పందం (ఎంఓసీ)పై భారత్-జపాన్ సంతకాలు

జనవరి 18, 2021

1. "నిర్దిష్ట నైపుణ్య కార్మికుడు (ఎస్ఎస్‌డబ్ల్యూ)"కి సంబంధించి తగిన నిర్వహణ వ్యవస్థ ఏర్పాటు కోసం భాగస్వామ్యానికి ప్రాథమిక కార్యాచరణపై భారత్ మరియు జపాన్ ప్రభుత్వాల మధ్య సహకార ఒప్పందం (ఎంఓసీ) కుదిరింది. విదేశాంగ కార్యదర్శి శ్రీ హర్ష్ వర్ధన్ శ్రింఘ్లా మరియు భారత్‌లో జపాన్ రాయబారి గౌరవనీయ శ్రీ సుజుకి సతోషి 18 జనవరి 2021న న్యూఢిల్లీలో ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు.

2. జపాన్‌లో పనిచేయడం కోసం భారత్ నుంచి నైపుణ్యం కలిగిన కార్మికులు వెళ్లడాన్ని ప్రోత్సహించేందుకు ఈ ఎంఓసీ దోహదం చేస్తుంది. 14 విభాగాల్లో నిర్దిష్ట నైపుణ్యాలు ఈ ఎంఓసీ పరిధిలోకి వస్తాయి. దీని ప్రకారం అవసరమైన నైపుణ్యాలు అలాగే జపనీస్ భాషకు సంబంధించిన పరీక్షల్లో అర్హత సాధించిన భారతీయ కార్మికులు కాంట్రాక్టు పద్ధతిలో జపాన్‌లో కొలువులు పొందేందుకు అర్హులు. ఈ 14 నిర్దిష్ట పారిశ్రామిక విభాగాల్లో నర్సింగ్ సంరక్షణ, భవనాలను శుభ్రం చేయడం, మెటీరియల్ ప్రాసెసింగ్, పారిశ్రామిక యంత్రాల తయారీ, ఎలక్ట్రిక్ మరియు ఎలక్ట్రానిక్ ఇన్ఫర్మేషన్, నిర్మాణ రంగం, నౌకా నిర్మాణం మరియు నౌకలకు సంబంధించిన పరిశ్రమ, ఆటోమొబైల్ మెయింటెనెన్స్, విమానయానం, లాడ్జింగ్, వ్యవసాయం, ఫిషరీస్, ఆహారం మరియు పానీయాల తయారీ ఇంకా ఆహార సేవల పరిశ్రమలు ఉన్నాయి. ఈ విభాగాలకు చెందిన కార్మికులకు జపాన్ "నిర్దిష్ట నైపుణ్య కార్మికుడు" హోదాను మంజూరు చేస్తుంది. ఈ ఎంఓసీ కింద జపాన్‌కు వెళ్లే భారతీయ నైపుణ్య కార్మికులు జపాన్‌లో పనిచేస్తూనే కొత్త నైపుణ్యాలను కూడా పొందేందుకు అవకాశం ఉంటుంది. ఈ కార్యక్రమాన్ని సజావుగా అమలు చేసేందుకు అలాగే నిర్వహణ వివరాలను రూపొందించేందుకు సమీప భవిష్యత్తులో ఇరు దేశాల అధికారులతో కూడిన ఒక జాయింట్ వర్కింగ్ గ్రూప్ (జేడబ్ల్యూజీ)ను ఏర్పాటు చేయనున్నారు.

3. గడిచిన కొన్నేళ్లలో నైపుణ్యాల అభివృద్ధి రంగానికి సంబంధించి భారత్ మరియు జపాన్‌లు తమ మధ్య సహకారాన్ని బలోపేతం చేసుకున్నాయి. 2016లో ఇరు దేశాలు "తయారీ రంగంలో నైపుణ్యాల బదలాయింపు ప్రోత్సాహక కార్యక్రమం" ఒప్పందంపై సంతకాలు చేశాయి. జపాన్-భారత్ ఇనిస్టిట్యూట్స్ ఫర్ మాన్యుఫాక్చరింగ్ (జేఐఎం) మరియు భారత్‌లోని కాలేజీల్లో జపాన్ అందించిన కోర్సుల (జేఈసీ) ద్వారా 10 సంవత్సరాల్లో 30,000 మందికి జపనీస్ శైలిలో తయారీ రంగ నైపుణ్యాలు మరియు విధానాల్లో శిక్షణ ఇవ్వడం అనేది ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. ఇది మొదలైన

నాటి నుంచి 13 జేఐఎంలు మరియు 5 జేఈసీలు ఇప్పటికే పనిచేస్తున్నాయి. 2017లో “టెక్నికల్ ఇంటర్న్ ట్రైనింగ్ ప్రోగ్రామ్” ఒప్పందంపై ఇరు దేశాలు సంతకాలు చేశాయి. దీనివల్ల తయారీ, ఆరోగ్య సంరక్షణ, నిర్మాణం, టెక్స్‌టైల్స్ మరియు వ్యవసాయం సహా విభిన్న రంగాల వ్యాప్తంగా భారతీయ యువతకు జపాన్‌లో ఇంటర్న్‌షిప్ పొందే అవకాశం లభిస్తుంది. నైపుణ్యాల అభివృద్ధి విభాగంలో భారత్-జపాన్ భాగస్వామ్యాన్ని మరింత పెంపొందించే దిశగా నిర్దిష్ట నైపుణ్య కార్మికులకు సంబంధించి తాజాగా కుదిరిన ఎంఓసీ మరో కీలక ముందడుగుగా నిలుస్తుంది.

4. ఈ సంతకాల వేడుకలో నైపుణ్యాల అభివృద్ధి మరియు ఎంట్రప్రెన్యూర్‌షిప్ మంత్రిత్వ శాఖ సెక్రటరీ శ్రీ ప్రవీణ్ కుమార్ అలాగే జపాన్ రాయబార కార్యాలయానికి చెందిన అధికారులు కూడా పాల్గొన్నారు.

**న్యూఢిల్లీ**

**జనవరి 18, 2021**

DISCLAIMER: This is an approximate translation. The original is available in English on MEA’s website and may be referred to as the official press release.